

# కమీషన్

''మళ్లా కమీషన్ అందిందా గణపతీ? ఖాళీగా వున్నావా?'' వినాయకరావు గారడిగారు. ఆయన లా ప్రాక్టీసు చేస్తున్నాడు. కుర్రకారు అడ్వొకేట్సుని ఆటలు పట్టిస్తాడు. హాస్యాలాడుతూ ఆరోగ్యంగా వుంటాడు. ''ప్రాక్టీసెట్లావున్నదీ?'' అని అడగడు. ''కమీషన్ కావాలా?'' అంటాడు. అంటే చేతినిండా కేసులున్నాయా? అని అడగటం.

వినాయకరావుగారి వయస్సు పెరిగిన కొద్దీ ప్రాక్టీసూ పెరిగింది. గుమస్తాకీ తనకీ వూపిరాడక, స్నేహితుల కొడుకులకీ, అడిగిన కొత్త అడ్వొకేట్సుకీ, గ్రీటింగ్సు పంపే లాయర్లకీ, యోగక్షేమం అడిగే వారికీ, కమీషన్లు యిస్తాడు. తలా, మీసం, గడ్డం నెరిసినా, చలాకీగా వుండి నవ్వుతూ మాట్లాడుతాడు. అమెచూర్ అసోసియేషన్ క్లబ్ అని పెట్టి ఏకాంకిలూ, హాస్యవల్లరీ, ఏకపాత్రాభినయం, ధ్వన్యనుకరణం ప్రోగ్రామ్సు పెట్టిస్తాడు. టెన్నీస్, బాడ్మింటన్, ఛెస్, స్క్రాబుల్, ఆడే వీళ్లు కల్పించాడు.

ఆయన మిత్రుడు గజముఖరావు, సాయం సమయంలో వచ్చి పక్క కుర్చీలో కూర్చున్నాడు. దినపత్రిక తిరగేస్తున్నాడు.

''అలా అడుగుతావేం వినాయక్! గణపతి న్యాయవాది కాదే? నీ కేసులు వాడికెలా యిస్తావు?''

''గణపతి హాబీ, యెవరేపని చెప్పినా, 'అదెలా సాధ్యం'? అనకుండా చేసిపెట్టటమే. పిన్న వయస్సప్పటినించీ అంతే. వాళ్ల నాన్న, తమ గ్రామంలో హైస్కూలు లేదని, పట్నంలో, తన బంధువుల యింట్లో గణపతి నుంచి, 'హైస్కూలు చదువు పూర్తి చేయి' అని కమీషన్ యిచ్చాడు. ఇంచక్కా గణపతి, బంధువులకు సాయపడుతూ, అరమరికలు లేకుండా అన్ని పన్లు అందుకుంటూ

మాటపడకుండా హైస్కూలు చదువుపూర్తిచేసి యింటికి వచ్చాడు. తనంతట తానే ప్రోజక్టూ తలపెట్టడు. యెండాకాలం శలవల్లో క్లబ్బుమానేజ్ చేసి యింప్రూవ్ చేయమని నేను కమీషనిచ్చాను. చూశావుగా యెంత బాగా యింప్రూవ్ చేశాడో. వాడికప్పగించేనాటికి కొర్థంలాగా వుండేది. దాన్ని చక్కగా అన్నివైపులా పెంచి పూలతోట, ఫెన్సూ, గెస్టురూమూ, రాత్రి పడినా టెన్నిస్ ఆడుకునేందుకు ఫ్లడ్ లైట్సూ, కొంతమంది మెంబర్సుకీ రాత్రి పడ్డాకే తీరుబాటు అందుతుంది. బిలియర్డ్స్ ఆడే బల్లకి కొత్త లైనింగ్ వేయించాడు. కొళాయి, ఫ్రిజ్, గీసర్ అన్నీ అమర్చి బంగళాలాగా చేశాడు గణపతి. రాత్రులందూ ఆడే వీలుగా సీలింగ్‌కి లైట్లు పెట్టించాడు. ఆ కమీషన్ పూర్తి చేసేనాటికి గణపతి తాతగారొచ్చి కాకినాడ తీసికెళ్లాడు గణపతిని. తన తమ్ముడు చివరి కొడుకుని కనిబెట్టి చూస్తూ గార్డియన్‌లాగా నన్నమాట మెడిసిన్ పూర్తిచేయిస్తూ వీడూ పూర్తి చేయాలిట అదీ కమీషన్.''

''చాలా పెద్ద జీతమే యివ్వాలే తాతగారు.''

''వూరికే యెందుకిస్తాడూ ఆ చివరి కొడుక్కి యింటర్లో రాంక్ వచ్చేటట్టు చూడమని వాడి తండ్రియిచ్చిన కమీషన్ పూర్తి చేశాడు గణపతి''.

'' ఆ కమీషన్ పూర్తి చేశాడూ ?''

''అది సగపడుతుండగా తండ్రివచ్చి, చెల్లికి సంబంధం చూడమని మరొక కమీషన్ యిచ్చాడు.''

''చాలైందీ?'' అన్నాడాశ్చర్యపోతూ,

'' ఒప్పుకున్న తరువాత చేసి చూపించాలి అదీ వాడి తత్త్వం. దివ్యమైన సంబంధం చూశాడు. వరుడు యింజనీర్.''

'' ఎలక్ట్రికలా, మెకానికలా, రేడియో యింజనీరా?''

'' ఎలక్ట్రికలే. బుద్ధిమంతుడు. ఆస్తి వున్నది. తక్కువ కట్నానికి ఒప్పించాడు గణపతి. ఫ్రెండ్సు ద్వారా అన్నీ సేకరించి తండ్రికి తెలియజేశాడు. పెళ్లి జరిగింది. స్నేహితుల సాయంతో ప్రొడక్షన్ కంట్రోలర్‌గా అప్పుకాకుండా చూశాడు.''

''గట్టివాడే'' అన్నాడు గజముఖి.

''అప్పుడే తీర్పు యిచ్చావే?''

'' ఇంకా వున్నదీ?''

''వున్నది. యెవరు పాసుకాలేమని అధైర్యపడ్డా గణపతితో చెప్పుకుని కమీషనిస్తే, పనిచేసి చూపుతాడు. పనివిలువ తెలిసినవారు ముందే పరకో పాతికో అందిస్తారు.''

''అంత పరపతి తెచ్చుకున్నాడూ?'' అని ఆశ్చర్యపోయాడు.

''తెచ్చుకున్నట్టే వున్నది మరిచూస్తే. నా బావమరిది తన కొడుకుని మెడిసిన్ చదివించాలని వున్నదని మనవి చేశాడు. చిక్కేమిటంటే రాంకూ లేదు. యింటరెస్టూ లేదు కొడుక్కి.''

''అదీ ఒప్పుకున్నాడూ?''

'' ఆ. గుల్బర్గాలో కాపిటేషన్ ఫీజు కట్టించి, సీటు తెప్పించి అబ్బాయిని కాలేజీలో జాయిన్ చేయించి వచ్చాడు గణపతి.''

''తాతగారిచ్చిన కమీషనేం చేశాడు యిన్ని గొడవల్లో?''

''అదీ తను గార్డియన్‌గా వున్న అబ్బాయితో సహా పూర్తి చేశాడు. మళ్లా కమీషన్ లేదు. యెమ్మెస్ గానీ, యండీగానీ చేయాలి. పిల్లనిస్తామనీ, బాడీగార్డుగా వుండి, దాన్ని దాని పిల్లల్నీ సాకాలని కమీషన్లు వచ్చాయిగానీ ఆ

కమీషన్లు మరీ రెస్పాన్సిబిలిటీతో కూడుకున్నవనీ, అవి తేలేవిగాదని, పిల్లల్నీ కాక మనుమలు మనుమరాళ్లనీ గూడా చదివించాల్సివస్తుందనీ రిజెక్ట్ చేశాడు గణపతి. మళ్లా మేము కలుసుకున్నప్పుడు, నేను సాయం చేస్తాను. ప్రాక్టీసు పెట్టుకో అన్నాను.''

''అది కమీషన్ గాదండీ. అప్పు. నేను మా నాన్నకి, 'అప్పు చేయను' అని వాగ్దానమిచ్చాను'' అని నవ్వి వెళ్లిపోయాడు. తరవాత మేము కలుసుకోలేదు. అప్పుడే పుష్కరం గడిచింది. నేటికి కంటబడ్డాడు'' అంటుండగా గణపతి టెన్నిస్ కోర్టునించి వచ్చాడు. వినాయకరావు కుర్చీ చూపాడు. కూచున్నాడు.

డ్రింక్స్ తెప్పించి, గ్లాసుల్లోకి వంచి యెదుట బల్ల మీదుంచాడు.

''బావున్నారా? కమీషన్లొస్తున్నాయా? ఖాళీయా?'' అన్నారు వినాయకరావుగారు. గ్లాసులందుకుని సిప్ చేస్తున్నారు.

''కమీషనేమో వచ్చిందండి. ఇది జీవితాంతం కమీషన్. హౌసర్జన్ కానిచ్చి, మున్సిపల్ కమీషనరు గారిచ్చిన హెల్త్ సెంటర్ రన్ చేసే కమీషన్ అందుకున్నానండి. అక్కడ నించి తాలుకాకి మార్చాడాయన. అక్కడ క్వార్టర్సులో క్రైసిస్‌తో కూడిన కమీషనొచ్చిందండి'' అని గుటక వేశాడు గణపతి.

''పార్ట్నర్ పట్టుకుందా?'' అని నవ్వాడు వినాయకరావు.

''బాగా వూహించారు. యెప్పుడూ యేదో కేసులో యిరుక్కునేది. యేడుపు దిగమింగుతూ, నోట్లో రుమాలు కూరుకుని, నా క్వార్టర్సుకి వచ్చేది. అంతావిని ఆడపిల్ల తెలివితక్కువగా కేసులో ఇరుక్కున్నదని, ఆ కేసులోంచి బైటికి లాగితే మరోకేసులో దిగబడేది. దాంట్లోంచి పైకిలాగితే యింకోటి, అలా గొలుసు కేసులు. విసుగేసి, 'కరప్షన్ ప్రాక్టీస్ చేయకు. దొంగసర్టిఫికేట్లివ్వకు' అని

కేసుల్లో యిరుక్కోకుండా వుండే మార్గం చూపితే, ''చదివినదెందుకు సంపాయించటానిక్కదా!'' అని వెకిలి నవ్వునవ్వుతూ నన్నే కేసులో కూరిందండీ. యేడుపువినలేక, ఆమెకి చెడ్డపేరు రాకుండా పరిష్కరిద్దామని పెళ్లాడాల్సి వచ్చి, యిష్టం లేకుండానే ఆ పనికానిచ్చానండి. అంతటితో నా ఖర్మకి నన్నొదిలేస్తే సరిపోయేది'' అని డ్రింక్ సిప్ చేస్తూ సగం పూర్తి చేశాడు గణపతి.

'' ఇహ వేరే కమీషన్ లేనట్టు పిల్లల్ని కనటం మొదలెట్టింది పార్ట్నర్.'' చేదు మింగుతున్నట్టు చూశాడు గణపతి.

''మంచిదేగా కమీషనూ'' అని సర్దేయాలని చూశాడు శ్రోత.

''యేమో నాకలా అనిపించలేదు. ఆమె డెలివరీకి సాయపడాలని వచ్చామని చెపుతూ అగ్రహారీకులల్లే వచ్చి, దాష్టీకం చేస్తు కమీషన్లు నామీద గుప్పించటం, పోన్లే అని ఒకటి నెరవేరిస్తే మరోటీ, రోగాలు బాగుచేయటం గాక రీచువల్సు, చదువులు, సంబంధాలు శరపరంపరగా కమీషన్లు వచ్చి పడ్డాయండి నా మీద. డైవోర్సు వేపు నెట్టుతున్నారని తట్టింది. ఒక కాన్ఫరెన్సుకు వెళ్లినప్పుడు నా గోడు ఒక స్పెషలిస్టు గైనకాలజిస్ట్ విన్నాడు. బర్త్ కంట్రోల్ ఆపరేషన్ చేసి ఒడ్డునబడేశాడండీ'' అని నవ్వి మళ్లా సిప్ చేశాడు గణపతి. అదివిని పెద్ద రాద్ధాంతం చేశారింటి దగ్గర. ఇంక లాభంలేదని డైవోర్సుకు పెట్టాను. పిల్లల్ని యివ్వనన్నది. అందర్నీ సపోర్ట్ చేయటానికి మొత్తం జీతం నెలనెలా పంపాలట. ఆమె పాతివ్రత్యం వెలిగిస్తుందట. అందుకనామెను జీవితాంతం పోషించాలిట. అంటే భరణం యివ్వాలిట. సెకండ్ వరల్డ్వార్ మొదలెట్టింది జర్మన్సే గనక, ఓడిపోయినారు గనక యుద్ధ ఖర్చులు వారే భరించాలన్నారు బ్రిటిష్ వారు. '' ఇవ్వాలనుకోండి, కాని డబ్బేదీ?'' అన్నారు జర్మన్స్. ''అప్పు యిస్తాము తీర్చండి'' అన్నారు బ్రిటిష్వారు. మతిబోయేట్టున్నదని చూస్తుండగా ఒక హృద్రోగి ఆపద్బాంధవుడల్లే ఆదుకున్నారు. వాడి హృదయం బాగై కమీషన్ తానే

తీసుకున్నాడు నేనివ్వకుండానే'' అని సిప్ చేశాడు.

''యేం చేశాడూ? అడ్వకేటా ఆ రోగి?''

''మరే. ఇన్‌ష్యూరెన్సులో జరిగే దగా కేసుల్ని స్పెషలైజ్ చేశాడు. కృత్రిమ ప్రమాదం సృష్టించి, ప్రమాదంలో పోయాడని ఇన్సూరెన్సు లాగే వాళ్ల పనీ, బలవంతంగా చంపి, హఠాత్తుగా మృత్యువాత పడ్డాడని ఋజువుచేసి భీమాలాగే వాళ్లపనీ పడతాడు అయన.'' మళ్లా నవ్వు మొహమైంది.

'' ఇంటరెస్టింగ్‌గా వున్నదీ కమీషన్.'' వాళ్లిద్దరూ మెల్లిగా సిప్ చేస్తూ చూశారు. ''యెంత కమీషన్?'' అనడిగారు.

''నేను ఇన్‌పేషంట్ వద్దనుండి కమీషన్ తీసుకోను అని ఇన్ పేషంటుగా చేరాడు. ఆయన నియమం తనకు మెడికల్ హెల్పు చేసే డాక్టరు వద్దనుండి యేమీ తీసుకోరాదనిట. తల్లికి జాండిస్ నయమైంది. తండ్రికి శుక్లాలు తీయించాను. కొడుక్కి టాన్సిల్స్ తీయమన్నాడు. కూతురుకి టెస్టులు చేయించి అది టిబిగాదనీ, వరమ్స్ వల్ల అరుగుదల పడిపోయి, యెండిపోతూ జ్వరం తాకుతున్నదనీ చెప్పి, ట్రీట్‌మెంట్ యిచ్చి, ఆ అమ్మాయి ఆరోగ్యం చక్కదిద్దాను.''

''అలాగే ఆయనకు నా కేసు లోతుపాతులు తెలుసు. కూపీదారులాయన ఫ్రెండ్స్. రెండేళ్లలో డైవోర్సు శాంక్షనైంది. పిల్లలూ నాకే చెందారు. ఆమెకు భరణం యివ్వక్కర్లేదని తీర్పు వచ్చింది. ఆమె పెళ్లాడినా పెళ్లాడకపోయినా అంతేను'' అని నిట్టూర్చాడు.

''నాలుగు ముక్కల్లోనే చెప్పు. సస్పెన్సులో వుంచనేల?''

''అప్పటికే బోయ్‌ఫ్రెండ్సున్నట్టు కోర్టులో ఫొటోలు ఎగ్జిబిట్ చేశాడు. మోస్ట్ అన్ టాలెంటెడ్ లేడీ డాక్టరనీ, యీమె చేతిలో చచ్చిన స్త్రీల సంఖ్య,

యింటి పేర్లు అడ్రసులతో సహా బుజావుచేశాడు. ఒక యిన్స్యూరెన్సు కేసు ఆమె మీద రన్నవుతున్నది. ఆమె మేజరైన అమ్మాయిని, మైనరని సర్టిఫై చేసి ఒక నూతన నటుడిని రేప్ కేసులో యిరికించింది. ఆమెవేపు వారు పిల్లల్ని యిల్ ట్రీట్‌చేస్తున్నట్టు పిల్లలచేత కోర్టులో చెప్పించి, దెబ్బలు, వాతలు చూపించాడు. 'మేము మా నాన్న వద్దే వుంటాము. మమ్మల్ని దయగా చూసేవాడు.' అన్నారు పిల్లలు. దాంతో ఓడిపోయింది. ఆ దయగలవాడే నన్నీ వూరు వేయించాడు. దానికాయనే కమీషనిచ్చాడు. మర్డర్ కేసులో సాక్ష్యమిప్పించి గెలిచాడు. నేరస్థునికి శిక్ష పడింది. నేరస్థుడు కొట్టిన దెబ్బకే హతుడు పోయాడని రుజావుచేశాను.''

''మరిప్పుడు బాగున్నావా అంటే బాగున్నానని అనకుండా టెన్నిస్ కోర్టువేపు వెళ్లిపోయావేం?'' అనడిగాడు వినాయకరావుగారు.

'' ఆ నలుగురు బిడ్డలకీ గైడెన్సివ్వాలి. హెల్త్ ప్రాబ్లమ్స్ సాల్వ్ చేయాలి. పెద్ద చదువులు చదివించి, విదేశాలు వెళ్లే అవకాశమిప్పించాలి. లేకపోతే నా మర్యాద, గౌరవం పోతాయి. పిల్లల్ని పాడు చేశాడంటారు. ఇదంతా చాలా పెద్ద కమీషన్ గదండీ! ఒంటి రెక్కమీద యిదంతా నేనొక్కడినే చేయాలి'' అని మిగిలిన డ్రింక్ పూర్తి చేసి బల్లమీదుంచి, మూతి కర్చిఫ్‌తో అద్దుకున్నాడు.

''యెలాగోయీ వూరు చేరావు గనక, క్లబ్ మెంబరువిగా గణపతీ, కొత్త సెక్రటరీని యెన్నుకునే రోజు దగ్గర్లో వున్నది. నువ్వు స్టాండు కావాలి. అదీ నేను నీ కిచ్చే కమీషన్. దాంతో నీకు పిల్లల కోరికలు తీర్చటం సుగమమౌతుంది. నువ్వెళ్లిపోయాక క్లబ్ వెలవెల పోయింది. నువ్వు దాన్ని మళ్లా ధగధగలాడించాలి. డిన్నర్లు, వినోద కార్యక్రమాలు, సెమినార్లు బాగా అరేంజ్ చేసి, సక్సెస్ చేస్తావు'' అని లేచారు వినాయకరావు గారు. లైట్లు వెలిగినై.

గజముఖరావూ, గణపతీ గూడా లేచారు.